కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలోని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐలమ్మ కాలనీ, ఏబీ బర్ధన్ కాలనీ, రామిరెడ్డికాలనీ, ఎల్బీనగర్‌లో పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలో ఎన్ని కాలనీలు ఉన్నాయని వీటిలో ఎంత వరకు జనాబా ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో రోజువారి ప్రజల జీవన విధానంపై ఆరా తీశారు. ఐలమ్మ కాలనీ, ఏపీ బర్ధన్ కాలనీ, ఎల్బీనగర్ కాలనీలో సమ్మర్ స్టోరేజి పక్కన ఉన్న ఇళ్లను పరిశీలించారు. వీరికి ఇళ్ల పట్టాలు లేవని స్థానికుల నుంచి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే ఇళ్ల పట్టాల ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై నివేదికలు పంపాలన్నారు. గతంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన సమస్యను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుపై కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ఓటరు జాబితా సవరణపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంధ్యారాణి

తాడిపత్రిటౌన్: ఓటరు జాబితా సవరణలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంధ్యారాణి హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపడతామన్నారు. ఎలాంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని నాయకులకు సూచించారు. అనంతరం ఓటరు జాబితాపై నాయకులు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ విద్యా సలహాదారుకు సన్మానం

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లి, పసులూరు, నార్పల మండలం దుర్గం గ్రామాన్ని ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి ఆయా మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి తీసుకురావడంపై పి.కొత్తపల్లి, పసులూరు గ్రామస్తులు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు సాంబశివారెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ నీలం భాస్కర్ మాట్లాడుతూ సమస్యను ఎన్నో ఏళ్ల నుంచి ఎన్నోమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించలేదన్నారు. కాని జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేక చొరవతో సమస్య తీర్చారన్నారు. కార్యక్రమంలో బండి భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, కొండారెడ్డి, గుజ్జల కాశప్ప, నేసే శ్రీనివాసులు, జి.భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఈ–క్రాప్ నమోదు పక్కాగా చేపట్టండి

పామిడి: ఈ–క్రాప్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఏఓ డీ లీనా వసుంధర సిబ్బందికి సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి కాలాపురం గ్రామంలో శనివారం జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,755 ఎకరాల్లో రైతన్నలు పంటలు సాగుచేశారన్నారు. అన్నదాతలు అందరూ తాము సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్ చేయించుకోవాలన్నారు. అలాగే పత్తి, జొన్న, కొర్ర పంటలను అమ్మాలనుకున్న రైతులు గుత్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె కోరారు. పత్తికి క్వింటాల్ రూ.7020లు, హైబ్రీడ్ జొన్నకు రూ. 3150లు చొప్పున ప్రభుత్వ మద్దతు ధర కల్పించిందన్నారు.



కాలాపురంలో ఈ–క్రాప్ బుకింగ్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ డీ లీనా వసుంధర

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

శింగనమల: మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప, శివ పార్వతుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆత్మరామాలయం వద్ద అయ్యప్ప, శివపార్వతుల చిత్ర పటాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పకు పడి పూజ చేశారు. అయ్యప్ప, శివభక్తులు భజనలు చేశారు. మధ్యాహ్నం హారతి తరువాత వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామంలో సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప, శివ పార్వతుల గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శనివారం రాత్రి శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వామిని పల్లకిలో మండల కేంద్రంలోని పుర వీధుల్లో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు.



శింగనమలలో అయ్యప్పకు పూజలు చేస్తున్న స్వామి మాలధారులు

శ్మశాన వాటిక స్థలం కేటాయింపు హర్షణీయం

గుంతకల్లు: దోనిముక్కల రోడ్డులో క్రిస్టియన్ల శ్మశాన వాటికకు స్థలం కేటాయించడంపై యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం (యూసీడబ్ల్యూఎఫ్) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మోదినాబాద్‌లోని మెస్సయ్య చర్చిలో వారు విలేకరులతో మాట్లాడారు. సత్యనారయణపేటలోని సాయిబాబా గుడి సమీపంలోని ఉన్న క్రిస్టియన్ల శ్మశాన వాటిక బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేశారని తెలిపారు. రోజు రోజుకు పట్టణంలో క్రిస్టియన్లు జనాభా పెరిగిపోయిందన్నారు. పాతగుంతకల్లు, దోనిముక్కలరోడ్డు, అంబేడ్కర్‌నగర్, తిలక్‌నగర్, రాజేంద్రనగర్, మిల్లుఏరియా తదితర ఏరియాల్లోని క్రిస్టియన్లు మృతదేహాల ఖననం కోసం చాలా ఇబ్బందులు పడేవారమన్నారు. సమస్యను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన స్పందించి దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో స్థలం కేటాయించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వైవీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. యూసీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌జే పాల్, కోశాధికారి పీ.ఆంథోని, సహాయ కార్యదర్శి ఎస్.జ్యోతిరాజు, సలహాదారు స్టీఫెన్ బీనాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గద్దెల బావన్న, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పీహెచ్ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూసీడబ్ల్యూఎఫ్ నాయకులు

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. నక్కనదొడ్డి కొట్టాల, నరసాపురం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ప్రజల క్షేమసమాచారాలు, కష్ట సుఖాలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. వివిధ కారణాలతో ఇంకా ఎక్కడైనా మిగిలి ఉన్న సమస్యలను సైతం పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా సొంత ఊరిలోనే వారికి అన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టారన్నారు. ఆసరా, చేయూత వంటి పథకాలతో ఉపాధిలేని ఎంతోమంది అక్క చెల్లెమ్మలు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునేలా వారికి అండగా నిలిచారని తెలిపారు. ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగనన్నను ప్రజలు ఎన్నటికీ గుర్తించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణప్ప, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దశరథరెడ్డి, ఎంపీపీ బీవీ మాధవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, సింగిల్ విండో సుంకిరెడ్డి, నాయకులు శ్రీనివాస్ సాగర్, ఆదినారాయణ, హాజీ బాషా, నరసాపురం బాషా, రమీజాబేగం, యల్లప్ప, షేక్ ఖాశీం, షేక్షావలి, అబ్దుల్లా, మహబూబ్ బాషా . శంకరబండ ఎంపీటీసీ హరి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

తాడిపత్రిటౌన్: ఊరుచింతల గ్రామంలో శనివారం వికసిత్‌భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు అమర్నాథబాబు, తాడిపత్రి రూరల్ ప్రెసిడెంట్ రాంబాబు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: నీలాంపల్లి, చెదుల్ల పంచాయతీలో శనివారం ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ శ్రీదేవి, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, రమీజా, ఎంపీటీసీ అంజినరెడ్డి, డాక్టర్ స్వాతి లక్ష్మి, వికసిత్ భారత్ సంకల్ప్ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో నాడు–నేడు కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు చదువే ఆస్తిగా వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాడు–నేడు కింద మూడు దశలకు గాను మొత్తం రూ.16,025 కోట్లతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56,703 పాఠశాలలు, 3280 హాస్టళ్లను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, విద్యా కానుక, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్యాదీవెన పథకాలతో పేద విద్యార్థులను ఆదుకున్నారన్నారు. ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, నారప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీ సహకారంతో అటల్ ఏఐసీటీఈ ట్రెనింగ్, లెర్నింగ్ అకాడమీ ప్రాయోజిత ఫ్యాకల్టీ డేవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాలలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సస్టైనబుల్ టెక్నాలజీ, ఐఓటీ అప్లికేషన్ ఇన్ ది కన్‌స్ట్రక్షన్ అనే అంశంపై ఆరు రోజుల పాటు కార్యక్రమం జరిగింది. ఇందులో ఐఓటీ అప్లికేషన్ స్థిరమైన సాంకేతికతలను స్వీకరించడం ద్వారా నిర్మాణ రంగం మరింత సమర్థవంతమైన పర్యావరణ పరంగా ప్రాథమిక మార్పును చూస్తోందని ప్రొఫెసర్ అరుణకాంతి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ అజిత, ప్రొఫెసర్ వెంకటరమణ, ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్లు

'ఆడుదాం ఆంధ్రా'కు మైదానాలు సిద్ధం చేయండి

గుత్తి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు మైదానాలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంఈఓ రవినాయక్ ఆదేశించారు. శనివారం మండలంలోని కరిడికొండలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించే మైదానాన్ని వారు పరిశీలించారు. త్వరలో నిర్వహించే పోటీలకు సచివాలయానికి ఒక క్రీడా మైదానాన్ని గుర్తించి శుభ్రం చేయాలన్నారు. అందుకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను ఎంపిక చేసుకోవాలన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సహకారంతో క్రీడా మైదానాలను సిద్ధం చేయాలన్నారు. మైదానంలో పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత ఉంటే పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరంగయ్య, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కరిడికొండలో మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

మసీదు నిర్మాణం పరిశీలన



ఫయాజ్‌బాషాను అభినందిస్తున్న ముస్లింలు

తాడిపత్రిటౌన్: సజ్జలదిన్నె బెటాలియన్ సమీపంలో ఉన్న కార్పెంటర్ కాలనీలో ఫయాజ్‌భాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో తలపెట్టిన మసీదు నిర్మాణాన్ని ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత ఫయాజ్‌బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలువురు ముస్లింలు ఆయనను అభినందించారు.

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రిటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాయలసీమ జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో పట్టణంలోని టెక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన భానుతేజ 200, 800 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, జావెలిన్, డిస్క్‌త్రో విభాగంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి విష్ణు మొదటిస్థానంలో నిలిచారన్నారు. 800 మీటర్ల పరుగుపందెంలో యుగంధర్‌రెడ్డి రెండవస్థానం కైవసం చేసుకున్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

వీరన్నపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వీరన్నపల్లెలో వైద్య సేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శ్రీరామ్ కుమార్

యాడికి: వీరన్నపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ శ్రీరామ్ కుమార్ తన సిబ్బందితో వెళ్లి వైద్య సేవలు అందించారు. మొదట 53 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలను సేకరించి, వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యం అందిస్తున్నామన్నారు. అవసరమైన రోగులను ఆరోగ్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది, 104 సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి నివాళి



షేక్ సాబ్జి చిత్రపటం వద్ద సంతాపం ప్రకటిస్తున్న అంగన్‌వాడీలు

యల్లనూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి అంగన్‌వాడీలు సంతాపం ప్రకటించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ప్రాంతంలో అంగన్వాడీలు , ఆయాలు షేక్ సాబ్జి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలను వక్తలు గుర్తు చేశారు.

షేక్ సున్నీకి పీహెచ్‌డీ ప్రదానం



గుత్తి: పట్టణానికి చెందిన షేక్ సున్నీకి శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం శనివారం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. షేక్ సున్నీ ఎస్కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణా నాయక్ వద్ద చరిత్ర విభాగంలో సరోజీనాయుడు ఆదర్శాలు, భావాలు, దూర దృష్టి అనే అంశంపై పరిశోధన చేసింది. ఇందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. షేక్ సున్నీకు పీహెచ్‌డీ రావడంపై ఆమెను సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సంపత్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థిని బిందుకు నగదు అందిస్తున్న వేణుమాధవ్

శింగనమల: ఇంటర్ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, సాధించాలని ఆర్‌ఐఓ సురేష్‌బాబు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారంశింగనమలకు చెందిన మిరియాల వేణుమాధవ్ నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ శింగనమలకు చెందిన మిరియాల వేణుమాధవ్ విద్యార్థులకు ఇప్పటికే డిజిటల్ లైబ్రరీ నిర్మించారన్నారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన కె.రత్నకుమార్, హేమలత, నరేంద్ర, మురళి, వినోద్‌కుమార్, హరీష్, బిందు, బాబు నాయక్‌లకు ఒక్కొక్కరికీ రూ.6 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫీ, అధ్యాపకులు సుదర్శన్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, కాళి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

గుత్తి: ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ డీఈఈ రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హుసేన్ పీరా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ కొందరు అవసరమున్నా లేకున్నా రేయింబవళ్లు లైట్లు వేసి ఉంటారన్నారు. విద్యుత్ పొదుపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీఈ సాయి శంకర్, ఏఈ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. శనివారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్, జిల్లా కార్యవర్గసభ్యులు వేణు, నాయకులు అఖిల్, శివమణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాచేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

శింగనమల: మండలంలోని రాచేపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో తాగునీటి మోటారు వద్ద పైపులైన్ పగిలి వారం రోజుల నుంచి గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు కొందరు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. స్పందించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు పంచాయతీ అధికారులతో మాట్లాడి శనివారం పైప్ లైన్ మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్‌ఐ సాగర్ శనివారం తెలిపారు. కొప్పలకొండలో పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు, ఒక ఇసుక ట్రాక్టర్ గార్లదిన్నె పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి మైన్స్ అధికారులకు అప్పగించామన్నారు.

సంక్షిప్త సమాచారం

మట్కా బీటర్ల అరెస్టు

యల్లనూరు: బుక్కాపురం క్రాస్ వద్ద మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను పట్టుకున్నట్లు సీఐ సుబ్రమణ్యం శనివారం తెలిపారు. కొడవండ్లపల్లెకి చెందిన తిరుపతి నాయుడు, వాసాపురానికి చెందిన వెంకట శివుడు, తిమ్మంపల్లికి చెందిన ధన శేఖర్‌ను అరెస్టు చేసి రూ.11,200 నగదు స్వాధీనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

కరువు రైతులను ఆదుకోవాలి

గుంతకల్లు రూరల్: కరువు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం పాతకొత్తచెరువు గ్రామంలో సీపీఐ మహాసభలు ప్రారంభించారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పీ.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, గోవిందు, మల్లికార్జున మాట్లాడారు. తీవ్ర వర్షాభావంతో ఈ ఏడాది పంటలు పూర్తీగా తుడిచిపెట్టుకు పోయాయన్నారు. రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

రీసర్వేతో రైతుల భూములకు శాశ్వత రక్ష

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేతో రైతుల భూములకు శాశ్వత రక్షణ ఏర్పడుతుందని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు మండలంలో రీసర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. రెండో విడత కింద మండలంలోని సంగాల, తిమ్మాపురం, దంచర్ల గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. గ్రామాల్లో రీసర్వే పూర్తి కావడంతో పాటు స్టోన్ ప్లాంటేషన్, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించామన్నారు. మూడో విడత కింద నక్కనదొడ్డి, వైటీ.చెరువు, పాతకొత్తచెరువు, అయ్యవారుపల్లి, అమీన్‌పల్లి గ్రామాల్లో చేపట్టిన రీసర్వే తుది దశకు చేరుకుందన్నారు. నాలుగో విడత కింద దోనిముక్కల, శంకరబండ, దోసలుడుకి, గుండాల గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నాయన్నారు.

మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసు

గుత్తి: తమ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 21 తర్వాత సమ్మెకు వెళ్లనున్నట్లు గుత్తి మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈమేరకు శనివారం మున్సిపల్ మేనేజర్ మురళి ధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, మహేష్, ప్రధాన కార్యదర్శి రామాంజి, కోశాధికారి బాలరంగన్న, సహాయ కార్యదర్శి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు తొలగించాలి

గుంతకల్లుటౌన్: ఓటరు జాబితాలో దొంగ ఓట్లను తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఇల్లూరుభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో చేరిన దొంగ ఓట్లపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ అధినాయకత్వం ఫిర్యాదు చేసిందన్నారు. పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ కన్వీనర్ బండారు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు విశ్వనాథ్, కొలిమి రామాంజి, రాఘవేంద్ర ఉన్నారు.